క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన



కొలతలు తీసుకుంటున్న క్యూసీ ఏఈ

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ, గెర్రె గ్రామాల్లో ఈజీఎస్ అమృత్ సరోవర్‌లో చేపట్టిన ఉపాధి పనులను క్వాలిటీ కంట్రోల్ ఏఈ రమేశ్ పరిశీలించారు. పని జరిగిన చోట పనులు ఏ మేరకు పూర్తి చేశారో కొలతలు తీసుకున్నారు. పనులు ఎంత వరకు చేపట్టారని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ స్థలం పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ స్థలాన్ని బుధవారం ఎంపీడీవో గంగాసింగ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌లు పాలె సుధాకర్, ఉపాసీ సంజీవ్, యువకులు మారయ్య, వెంకటేష్, శ్రీనివాస్, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు కిష్టయ్య, బాపురావు ఉన్నారు.

జిరాక్స్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని షిర్డీసాయి మందిర్ సమీపంలోని నాగోష తిరుపతికి చెందిన జిరాక్స్ సెంటర్‌లో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో జిరాక్స్ మిషన్, రెండు ప్రింటర్లతో పాటు ఇన్వర్టర్ కాలిపోయింది. దీంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తిరుపతి తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు గొడిసెల కార్తీక్, దినకర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితుడికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

'రక్తదానమే మహాదానం'

కాగజ్‌నగర్‌టౌన్: రక్తదానమే మహాదానమని కాగజ్‌నగర్ పట్టణంలోని విజేత హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఆర్. విద్యాసాగర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 30 మంది దాతలు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈయూ అసిస్టెంట్ సెక్రటరీ లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిని విధుల్లోకి తీసుకోవాలి

ఆసిఫాబాద్: విధుల నుంచి తొలగించిన జెనూర్ కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయిని ఎం. రేణుకను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. అంగవైకల్యం కలిగిన రేణుక సర్వీస్‌లో ఉత్తమ ఫలితాలు అందించిందన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె ప్రకాశ్, బిక్షపతి ఉన్నారు.

గురుడుపేట డీలర్‌పై కేసు నమోదు

కౌటాల: మండలంలోని గురుడుపేట రేషన్ డీలర్ ఆర్.లహానుపై 6–ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు తెలిపారు. లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గురుడుపేటలోని రేషన్ పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో 38 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యం స్టాక్‌లో తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. గురుడుపేట్ రేషన్ పంపిణీ కేంద్రం ఇన్‌చార్జి డీలర్‌గా కన్నెపల్లి రేషన్ డీలర్ నానయ్యకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

గాలివాన బీభత్సం

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి, అమరగొండ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం గాలితో కూడిన వర్షం కురిసింది. చినరాస్పెల్లి గ్రామంలోని పలువురు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ప్రయాణ తిప్పలు తప్పవా..?

- కొనసాగుతున్న అందవెల్లి వంతెన పనులు
- వాగు ఉప్పొంగితే దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు రాకపోకలు బంద్
- పెంచికల్‌పేట్ పెద్దవాగుపై మట్టితో అప్రోచ్ రోడ్డు పనులు



కొనసాగుతున్న అందవెల్లి వంతెన పనులు

దహెగాం: రెండేళ్ల క్రితం పెద్దవాగు ఉప్పొంగడంతో కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై వంతెన కూలింది. దీంతో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గత నవంబరులో పనులు ప్రారంభించారు. 7 నుంచి 11వ పిల్లర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు పేర్కొనగా అందుకు భిన్నంగా ఇక్కడ పరిస్థితి ఉంది. ప్రస్తుతం పిల్లర్ల పునాది దశలోనే పనులు కొనసాగుతున్నాయి. వేసవి కాలంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వాగులో తాత్కాలికంగా పైపులు వేసి రోడ్డు నిర్మించడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. వానాకాలం వచ్చినా వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో దహెగాం, భీమిని మండలాల ప్రజలకు మళ్లీ ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు.

45 గ్రామాలకు రాకపోకలు బంద్..?

పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కన్పించడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిస్తే వాగులో వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అలా జరిగితే దహెగాం, భీమిని మండలాల్లోని సుమారు 45 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఈ ఏడాది కూడా మళ్లీ రాకపోకలకు కష్టాలు తప్పేలా లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దహెగాం మండలవాసులు పెంచికల్‌పేట్ మీదుగా కాగజ్‌నగర్‌కు చేరుకోవాలంటే సుమారు 60 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు 30 కిలోమీటర్ల దూరం ఉంది. వర్షాకాలంలో వాగు ఉధృతికి రాకపోకలు నిలిచి పోతాయని వాపోతున్నారు. భీమిని మండలవాసులు కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే ఐబీ తాండూర్ మీదుగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

పెంచికల్‌పేట్ మీదుగా..

దహెగాం, పెంచికల్‌పేట్ మధ్యలో పెద్దవాగుపై వంతెన నిర్మాణం గత ఏడాది పూర్తయ్యింది. అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాలేదు. అందవెల్లి పెద్దవాగు వంతెన నిర్మాణం పూర్తి కానందున పెంచికల్‌పేట్ పెద్దవాగుపై వంతెన వద్ద మట్టితో అప్రోచ్ రోడ్డు వేశారు. దీంతో వర్షాకాలంలో పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లొచ్చు. కానీ భారీ వర్షాలు కురిస్తే అప్రోచ్ రోడ్డు కోతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోలు బంద్



రెండేళ్లుగా వానాకాలం వచ్చిందంటే ఆటోలు నడవడం లేదు. గత సంవత్సరం వంతెన కూలింది. వాగులో తాత్కాలిక రోడ్డు వేయడంతో ఆటోలు నడిపాం. వర్షాలు పడితే తాత్కాలిక రోడ్డు తెగిపోతుంది. పెంచికల్‌పేట్ మీదుగా వెళ్దామంటే అక్కడ చిన్న వంతెన కూడా తెగిపోయే అవకాశాలు ఉన్నాయి.

\- పవన్, ఆటోడ్రైవర్, దహెగాం

కాగజ్‌నగర్ వెళ్లాలంటే ఇబ్బంది



వివిధ అవసరాల నిమిత్తం నిత్యం కాగజ్‌నగర్‌కు వెళ్తుంటాం. వర్షాకాలంలో కాగజ్‌నగర్ వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. పెంచికల్‌పేట్ మీదుగా వెళ్దామంటే భారీ వర్షాలు కురిస్తే అక్కడ రోడ్డు కోతకు గురవుతుంది. రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి.

\- భీమయ్య, చౌక గ్రామం

'తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో ఆరోగ్య సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, కంటి వెలుగు పథకాలు ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. ఆయా రాష్ట్రాల సీఎంలు తెలంగాణలోని హెల్త్‌స్కీమ్‌లు పరిశీలించి వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలకు వైద్యం పరంగా చాలా మేలు జరిగిందన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్, ఎంపీపీలు నానయ్య, విశ్వనాథ్, కౌన్సిలర్లు విద్యావతి, బంక శివ, సంగీత, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ పల్లా కృష్ణప్రసాద్, డాక్టర్ సునీల్ రావు, విద్యావతి, నియోజకవర్గ స్థాయిలో మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సిబ్బంది, నర్సులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌటాల: చింతలమానెపల్లి మండలం డబ్బా ఎక్స్ రోడ్ గ్రామంలో పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సిబ్బంది లాలాజీ, దేవన్నలకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ ధరంపల్లి గ్రామం వరదలతో ముంపునకు గురికాగా ప్రభుత్వం డబ్బా చౌరస్తాలో కొత్తగా ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, కొన్నేళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నామన్నారు. గ్రామంలోని పిల్లల చదువు కోసం గతేడాది గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో పాఠశాల ఏర్పాటు చేసిందని తెలిపారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని, అప్పటి వరకు అద్దె చెల్లించడానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వాడాయి శేఖర్, గ్రామస్తులు గుర్లే గణేష్, రాజన్న, నికాడే సంజీవ్, విష్ణువర్ధన్, దుర్గం విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పులికుంట కాలనీలో అక్షరాభ్యాసం

రెబ్బెన: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పులికుంట కాలనీ పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందగా విద్యార్థులతో కలిసి సరస్వతీ పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ పోషమల్లు, ఎస్ఎంసీ చైర్మన్ పోషన్న, కాంప్లెక్స్ హెచ్ఎం అనురాధబాయి, హెచ్ఎం శ్రీనివాస్‌లు విద్యార్థులతో ఓనమాలు దిద్దించి అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ స్వప్న, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బడిబాటలో గుర్తించిన 1వ తరగతి విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. కేజీబీ పాఠశాలలో వినూత్నంగా విద్యార్థులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కౌటాల: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 6వేల పెన్షన్ ఇవ్వాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ప్రభుత్వం పెన్షన్లు పెంచిందన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు రాజేశ్, నాయకులు పోశన్న, సత్యనారాయణ, వాసుదేవ్, శంకర్, బాబురావ్, తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీ షెడ్యూల్ ప్రకటించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పోడు భూముల పట్టాల పంపిణీ షెడ్యూల్ ప్రకటించాలని టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు మాలశ్రీ, కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 24న జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ పోడు పట్టాల పంపిణీని ప్రారంభిస్తారని చెబుతున్నారని, దీనికి సంబంధించిన వివరాలను సమగ్రంగా వెల్లడించాలని కోరారు. ఏ రోజు.. ఏ మండలానికి పంపిణీ చేస్తారో ప్రకటించాలన్నారు. అర్హులైన వారికి దళారుల ప్రమేయం లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. అర్హుల జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దామోదర్, చిన్ను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఆసిఫాబాద్: జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, ఎంపీ సోయం బాపురావుతోపాటు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు వందన, ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, సప్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కెరమెరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఫార్మాసిస్టు ఖలీల్ హుస్సేన్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది రోగులకు పండ్లను అందజేశారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ అవినాష్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, జావిద్, సీహెచ్‌సీ వైద్యులు సుంకన్న, సిబ్బంది చామంతి, ఆయేషా, గణేష్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల సర్వే

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయ భూముల సర్వే ఈ నెల 15న గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కారం హన్మంతు తెలిపారు. ఆలయ భూముల హద్దులు గుర్తించడానికి సర్వే చేపడుతున్నామని, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, హాజరు కావాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గాంధీనగర్ నెం.2లో బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. సాయినాథ్ అనే వ్యక్తి ఆటోలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నామని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ఆసిఫాబాద్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు విధులపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు జాబితాను ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా, పారదర్శకంగా రూపొందించాలన్నారు. మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈనెల 23 నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రాజేశం, ఎస్పీ సురేశ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఏఈని బదిలీ చేయాలి

తిర్యాణి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న విద్యుత్ శాఖ ఏఈని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ అనంతరాజుకు ఆదివాసీ తుడుందెబ్బ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఏఈ స్థానికంగా ఉండకపోవడంతో అత్యవసర సమయంలో వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆరోపించారు. మండల అధ్యక్షుడు ఆత్రం గోపాల్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షుడు గెడం సుభాష్ తదితరులు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ బోనాలకు హాజరైన ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన: మండల కేంద్రంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ బోనాల కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ మురళీగౌడ్ ఇంట్లో నిర్వహించిన పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎస్సై భూమేశ్, బీఆర్ఎస్ నాయకులు దుర్గం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సారానికి రేగడి మట్టి

- చెరువుల్లోని మట్టి పొలాలకు తరలింపు
- ట్రాక్టర్‌కు రూ. 220 నుంచి రూ.250 చెల్లింపు



తలోడిలో నేల బలం కోసం చేనులో వేసిన మట్టి

కౌటాల: రైతులు పండిస్తున్న పంటల దిగుబడులను ఆశించిన మేర సాధించేందుకు వివిధ రకాల పద్ధతులు అవలంభిస్తున్నారు. ఇది వరకు అనేక పురుగు మందులు, రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడడంతో క్రమంగా భూసారం తగ్గడంతో పాటు మొక్కలకు అందాల్సిన పోషక విలువలు దహించుకుపోయాయి. ఎరువుల కోసం అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి పంటల దిగుబడి రాకపోవడంతో ఎంతో మంది రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడులను తగ్గించుకునేందుకు రైతులు శ్రీకారం చుట్టారు. దీంతో రైతులు చెరువుల్లోని మట్టిని పంటపొలాలకు తరలించి భూములు సారవంతమయ్యేలా చూస్తున్నారు. వర్షాలు జోరందుకునేలోపు రేగడి మట్టిని పొలాల్లో వేసి చదును చేసే పనిలో పడ్డారు.

మట్టి.. చేలకు తరలింపు

స్థానిక చెరువుల్లోని రేగడి మట్టిని అన్నదాతలు పంట పొలాలకు తరలిస్తున్నారు. దీంతో పొలాలు క్రమేణా సారవంతంగా మారుతాయని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని యాపలగూడ గ్రామ సమీపంలోని చెరువులో మట్టిని తరలిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీలో భాగంగా చెరువు పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగాయి. ఉపాధి కూలీలు తీసిన రేగడిమట్టిని సైతం రైతులు తమ చెలకలు, పొలాలకు తరలించుకునేందుకు పోటీ పడుతున్నారు. సారవంతమైన మట్టిని ట్రాక్టర్లతో పొలాల్లో చల్లుతున్నారు. ఇందుకు ట్రాక్టర్‌కు రూ.220 నుంచి రూ. 250 వరకు చెల్లిస్తున్నారు. యించాలని చూస్తున్నారు

అనేక ప్రయోజనాలు..

చెరువు మట్టిలో అనేక పోషకాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పూడిక తీసిన మట్టితో పంట పెరుగుదలకు ఉపయోగపడే నత్రజని, భాస్వరం, పోటాష్ వంటి పోషకాలు లభిస్తాయి. దీంతో రైతులకు రసాయనిక ఎరువులకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. 15 నుంచి 25శాతం పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. చెరువు మట్టికి నీటిని ఎక్కువగా పీల్చుకునే సామర్థ్యం ఉండడంతో నీటితడి, వర్షాలు లేని సమయాల్లో మొక్కలకు తేమ అందుతుందని అధికారులు చెబుతున్నారు.

పంటలకు మేలు..

చెరువులో పూడిక తీసిన మట్టిని పంట పొలాల్లో చల్లుకుంటున్నాం. దీంతో తేమ శాతంతో మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయి. రసాయనిక ఎరువుల వాడకాన్ని అధిక మోతాదులో వాడడం ద్వారా భూమిలో సారం తగ్గిపోయి పంటల దిగుబడి కోల్పోయాం. రేగడి మట్టితో పంటలకు మేలు కలుగుతుంది.

\- రవి, రైతు, తలోడి

దిగుబడి పెరుగుతుంది

చెరువుల్లోని మట్టిని రైతులు పంట చేనుల్లో వేసుకుంటే నేలలు సారవంతంగా తయారై మంచి దిగుబడులు వస్తాయి. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. పోషక విలువలు కలిగిన మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అన్నదాతల్లో వచ్చిన మార్పుతో మంచి ఫలితాలు వస్తాయి.

\- రాజేశ్, వ్యవసాయాధికారి, కౌటాల

వ్యాయామశాలను ప్రతీరోజు తెరవాలి

రెబ్బెన: కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను ప్రతీరోజు తెరిచేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. బుధవారం ఏరియా జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు భరత్, వివేక్ చారి ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిష్పక్షపాతంగా చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల డెప్యూటేషన్లను నిష్పక్షపాతంగా నిబంధనలు అనుసరించి కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కుమార్‌కు తన కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందూరావు, హేమంత్ షిండే, దూలం ఎల్లయ్య, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ మహర్, నేతకానీల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఏజెన్సీలోని నేతకాని, మహర్‌ల సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జిల్లా కేంద్రంలోని సంఘం కమిటీ ఎన్నికలను నిర్వహించి సంఘం బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సంతోష్, జాడి రాజన్న, అశోక్ మహాల్కర్, నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి

రెబ్బెన: నిబద్ధతతో పని చేస్తూ సంస్థ పురోభివృద్ధికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియాకు చెందిన ఇద్దరు భూనిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఎస్‌వోటూజీఎం కేహెచ్ఎన్ గుప్తా, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతిలు పాల్గొన్నారు.

సర్కారు బడిలోనే చదివించాలి

నార్నూర్: పిల్లలను సర్కారు బడిలోనే చదివించాలని ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.